క్లుప్తంగా

భక్తాంజనేయస్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని భక్తాంజనేయస్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు అభిషేక పూజలు చేశారు. వడమాల సమర్పించి సుగంధభరిత పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గో పూజ నిర్వహించారు. భక్తులు గోమాతకు పూజలు చేసి, ప్రదక్షిణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వలసలు ఆపాలి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ గంగాభవానీ

పెనుమూరు(కార్వేటినగరం): రానున్న వేసవి కాలంలో ఉపాధిహామీ కూలీలు వలస పోకుండా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ గంగాభవానీ అన్నారు. మంగళవారం మండలంలోని గుంటిపల్లె, కావూరివారిపల్లె పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కూలీలతో ముఖాముఖి నిర్వహించి, దినసరి వేతనం ఎంత వస్తుందని ఆరా తీశారు. రోజు వారీ కూలీ ఎంత వస్తుందని అడిగారు. రోజువారి రూ.250 వస్తుందని కూలీలు సమాధానం చెప్పారు. అనంతరం పీడీ మాట్లాడుతూ వేసవికాలంలో కూలీలు వలసలు పోకుండా అందరికీ పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గుణశేఖర్, ఈసీ సతీష్, టీఎలు మదివన్నణ్,బాబు, వినోద్, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు



బోర్డు ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

వెదురుకుప్పం: ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.పద్మనాభరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దిగువపల్లాలు పంచాయతీ ఆళ్లమడుగు దళితవాడకు సంబంధించి శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించారు. ఆళ్లమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే 554–2లో 32 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించారు. సర్వే చేసి హద్దులు, శ్మశాన స్థలంలో బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయనివిధంగా శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి వెంటనే శ్మశాన వాటికలకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎర్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు హరినాథ్, వీఆర్‌పీ దాము పాల్గొన్నారు.

సకాలంలో సిమెంట్ పంపిణీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఈ వెంకటేశ్వర్

పాలసముద్రం : గృహ నిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో సిమెంట్ పంపిణీ చేస్తున్నామని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం పాలసముద్రంలోని సిమెంట్ గోడౌన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో సిమెంట్ నిల్వల మొత్తానికి నిల్వ ఉన్న బస్తాలను సరి చూశారు. జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లు పెట్టాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని తెలిపారు. ప్రభుత్వం కూడా సకాలంలో బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంట్ ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దాము, సూపర్ వైజర్ బాబు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

పాలసముద్రం : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే పరీక్షల్లో మంచి ర్యాంకు వస్తుందని ఎస్‌ఐ బి సురేష్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో భోజనం విరామం సమయంలో మహిళ పోలీసులతో కలసి ప్రిన్సిపల్ వినాయకం అధ్యక్షతన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. ర్యాగింగ్‌తో జీవితాలను బలి చేసుకోవద్దని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధమని, దానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఉపయోగపడుతుందన్నారు.

మాతృభాష తల్లితో సమానం



పుత్తూరు రూరల్: బహుమతి అందుకుంటున్న విద్యార్థి



వెదురుకుప్పం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద



కార్వేటినగరం: తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు



నగరి: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్



విజయపురం: విజేతకు బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

పుత్తూరు రూరల్: మాతృభాష తల్లితో సమానమని, దాన్ని గౌరవించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డ ఎలాంటి శిక్షణ లేకుండా అప్రయత్నంగా తల్లి నుంచి నేర్చుకొనే భాష మాతృభాష అని చెప్పారు. మాతృభాష నశిస్తే ఆ భాష మాట్లాడే జాతి మొత్తం నశిస్తుందన్నారు. తెలుగుతోపాటు ఆంగ్లభాషను నేర్చుకోవాలని, తెలుగు భాష బదులు ఆంగ్లభాష నేర్చుకోకూడదని చెప్పారు. తెలుగుశాఖాధ్యక్షురాలు డాక్టర్ పి.కుమారి నీరజ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంలో మాతృభాషదే మొదటి స్థానమన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేసే నాటికను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వీరయ్య, విష్ణుప్రకాష్, మన్యం నరసింహులు, వరలక్ష్మి, హరిబాబు, సాయి వెంకటేష్, కృష్ణయ్య, నరసింహులు, వాణిశ్రీ, దేవకి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషాదినోత్సవం

కార్వేటినగరం: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వైవీ వసుమతీదేవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అన్ని భాషలకన్నా తెలుగు భాష భారతదేశంలో ఎంతో గొప్పదని అభివర్ణించారు. ఎందరో తెలుగు కవులు తమ రచనల ద్వారా చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు మాధవరెడ్డి, జనార్ధన్ మాట్లాడుతూ మాతృభాష గొప్పదని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

విశిష్టమైనది అమ్మభాష

వెదురుకుప్పం: మాతృభాష ఎంతో విశిష్టమైనదని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జెడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర భాషోపాధ్యాయ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ మాతృభాష ఆవశ్యకతను గుర్తు చేసుకోవాలన్నారు. మాతృభాష ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో నినాదంగా మారాలని సూచించారు. హిందూ సంస్కృతి, ఆచారాలలో మాతృభాషతో ముడిపడి ఉందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పద్య పఠనం, పాటలు, నృత్య పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు, తెలుగు శాఖ అధ్యక్షుడు భీమమోహనరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు బండి ప్రభాకర్‌రెడ్డి, మురళీరెడ్డి, శ్రీనివాసులు, విజయలక్ష్మి, శంకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

మరచిపోలేనిది మాతృభాష ఔనత్యం

విజయపురం : మాతృభాష ఔనత్యం మరచిపోలేనిదని గంగమాంబపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమాశంకర్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవితంలో ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషా సౌందర్యాన్ని మర్చిపోలేమన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్యాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీబాబు, షణ్ముగం, కోమలేశ్వరి, వెంకటరమణ, రుద్రమూర్తి, రమా, విజయ్, సదాశివం తదితరులు పాల్గొన్నారు.

ప్రావీణ్యం సంపాదించుకోవాలి

నగరి : జీవితంలో రాణించడానికి మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో తెలుగు విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షోపన్యాసం చేశారు. అవసరానికి, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఆంగ్లం, ఇతర భాషలు నేర్చుకోవాలే కానీ మన మాతృభాష అయిన తెలుగులోని తియ్యదనం, గొప్పతనం మాత్రం ఎప్పటికీ మరచిపోలేనిదని తెలిపారు. మాతృభాష తల్లిలాందని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ బి.సుబ్రమణ్యం మాట్లాడుతూ అమ్మపాలలోని కమ్మతనం, తియ్యదనం తెలుగులో ఉంటుందని అందుకే శ్రీకృష్ణదేవరాయులు దేశభాషలందు తెలుగు లెస్స అని కొనియాడారన్నారు. ఆంగ్లభాష వ్యామోహంలో పడి ప్రాంతీయ మాతృభాషలు అంతరించిపోకూడదనే ఉద్దేశంతో యునెస్కోవారి ప్రతిపాదనలు అనుసరించి 2000 వ సంవత్సరం నుంచి ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. తెలుగు మరిస్తే జాతికి తెగులు వచ్చినట్టేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమణారెడ్డి, చిన్నపాపమ్మ, ధర్మారావు, అరుణకుమారి, అకడమిక్ కోఆర్డినేటర్ భాస్కరరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మురళీమోహన్‌రెడ్డి, జోతి, పొన్నాంబలం తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సైన్యంలా పనిచేయండి



విజయకేతం చూపుతున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, నాయకులు

నగరి : గృహసారథులు జగనన్న సైన్యంలా పని చేయాలని మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం మంగాడు గ్రామంలో పర్యటించిన ఆయన వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలోని ప్రజలకు వివరించే జగనన్న సైన్యంలా గృహసారథులు పనిచేయాలన్నారు. అలాగే నాయకులు, కార్యకర్తలను ఒకతాటిపైకి తెచ్చి ఐక్యమత్యమే బలంగా ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఢిల్లీబాబు, జగదీష్, శ్రీనివాసులు, గోవిందరెడ్డి, గోవిందయ్య, నాగయ్యనాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చందనాలంకరణలో బంగారమ్మ

కార్వేటినగరం: గ్రామదేవత బంగారమ్మ మంగళవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేకువ జామున పాలు, పెరుగు, పసుపు, తేనే, నారికేళ జలాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం చందనంతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోంది!



కైలాసరెడ్డికి సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: ప్రజలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటోందని పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం నింద్ర మండలం ఎలకాటూరు గ్రామానికి చెందిన కైలాసరెడ్డికి రూ.50 వేల సీఎం సహాయనిధి చెక్కును ఆమె అందజేశారు. అనారోగ్యం పాలై వైద్య ఖర్చులకు ఎక్కువ మొత్తం వెచ్చించి కష్టాలకు లోనైన కైలాసరెడ్డి తన పరిస్థితిని మంత్రికి విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన మంత్రి అయనకు సీఎం సహాయనిధి నుంచి నగదు అందేలా చేశారు. సహాయనిధి చెక్కును అతనికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ఆదుకోవడమే కాక సహాయ నిధి ద్వారా కూడా ప్రభుత్వం కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తోందన్నారు. ప్రత్యేక చొరవ చూపి సీఎం సహాయనిధి మంజూరు చేసినందుకు కైలాసరెడ్డి కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేణురాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నట్టల నివారణకు మందు తాపిస్తున్న వైద్య సిబ్బంది

వెదురుకుప్పం: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మాంబేడు గ్రామంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిని అనుసరించి పశువుల పెంపకం చేపట్టాలన్నారు. సరైన సంరక్షణ ద్వారా పాడి వృద్ధి చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో పాడి పెంపకం చేపట్టేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పశువైద్యాధికారుల సూచనలు సలహాలను అనుసరించి మేలు జాతి పశువులను ఎంపిక చేసుకుని సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలకృష్ణారెడ్డి, పశువైద్య సిబ్బంది విజయలక్ష్మి, వెంకటముని పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం



గర్భిణీలు, బాలింతలకు గుడ్లు, పాలు, పిండి పంపిణీ చేస్తున్న సర్పంచ్

పాలసముద్రం : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్‌సీ సూపర్‌వైజర్ రాధ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఎన్నో పథకాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం మంచి పౌష్టికాహారం, ప్రతి రోజు గుడ్డు పెట్టాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పిండి తదితర సామగ్రి అందజేశారు.

గ్రీన్ అంబాసిడర్ల సేవలు ఎనలేనివి

పాలసముద్రం : పరిసరాల పరిశుభ్రతలో గ్రీన్ అంబాసిడర్ల సేవలు ఎనలేనివని పాలసముద్రం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎన్ శివప్రకాష్‌రాజు తెలిపారు. మంగళవారం పాలసముద్రంలో గ్రీన్ అంబాసిడర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత విషయంలోనూ గ్రీన్ అంబాసిడర్లు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు.గతంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి, దోమలు వృద్ధి చెంది, పలు రోగాలతో ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. గ్రీన్ అంబాసిడర్లు వచ్చిన తరువాత గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు.

సీజన్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రబాబు

పాలసముద్రం : వాతావరణంలో మార్పులతో వచ్చే సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని 104 వాహన వైద్యాధికారి చంద్రబాబు తెలిపారు. మంగళవారం సింహరాజుపురం పంచాయతీ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌ఓ సునీత, ఏఎన్‌ఎం రేవతి ఆధ్వర్యంలో 104 వైద్యపరీక్షలు చేశారు. డాక్టర్ చంద్రబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు వ్యాధులు వస్తే సుదూరంలోని ఆస్పత్రికి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంలో ప్రభుత్వం 104 వాహనం సేవలను ప్రారంభించిందన్నారు. ఈ వాహనంలో వైద్యసిబ్బంది జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. అనంతరం 45 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

సదాశివకోన ఆదాయం రూ.16.17 లక్షలు

వడమాలపేట. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సదాశివకోనలో ఉన్న సదాశివేశ్వరస్వామి ఆలయానికి వివిధ మార్గాల్లో రూ.16,17,746 ఆదాయం వచ్చినట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ జయచంద్రన్ తెలిపారు. తలనీలాల వేలంలో రూ.1,36,500, ప్రత్యేక దర్శనం, సర్వదర్శనం, అభిషేకం, సేవా టికెట్ల ద్వారా రూ.4,55,386 , సదాశివకోన, అమ్మ వారి కోనల్లో హుండీల ద్వారా రూ.10,25,860 మొత్తం రూ.16,17,746 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం గత ఏడాది కంటే అదనంగా రూ.2,32,324 వచ్చినట్లు చెప్పారు. సమావేశంలో బోర్డు సభ్యులు గోపి, ఉదయ్ కుమార్, కమలమ్మ పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

వడమాలపేట : వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈ నెల 25వ తేదీన వేలం వేయనున్నట్లు వడమాలపేట ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. వేలం పాటలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు మరిన్ని వివరాలకు వడమాల పేట పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు. వేలం పాటల్లో దక్కించుకున్న వాహనాలకు పోలీసు వారి నిబంధనలను పాటించాల్సి ఉంటుందని తెలిపారు.

అంకాళ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



పాలసముద్రం : మండలకేంద్రంలోని దళితవాడలో ఉన్న అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం మండలపూజ చేశారు. అమ్మవారి ఆలయ కుంభాభిషేకం జరిగి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ఉదయం అంకాళ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మహిళలు పంబవాయిద్యాల నడుమ పొంగళ్లను గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక దీపారధన పూజలు చేశారు.

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న ఏకాంబరం

గంగాధరనెల్లూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వన్నియకుల క్షత్రియ కులానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఆయన టీడీపీకి సేవ చేసినా గుర్తింపు లేకపోవడంతో బయటకు వచ్చారన్నారు. ఎన్నడూ లేని విధంగా అనేక మంది ఎమ్మెల్సీ సీట్లను బీసీలకు కేటాయించడంతో సీఎం పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బీసీలకు సముచిత స్థానం కల్పించి, పేదల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. వైస్‌ఎంపీపీ హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందరెడ్డి, వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ఉగాది నాటికి పక్కాగృహాలు పూర్తి సామూహిక గృహప్రవేశాలు చేసేందుకు సిద్ధం చేయాలని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉగాది నాటికి లబ్ధిదారులు పక్కాగృహాల నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రభుత్వం నిర్వహించే సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆర్థికంగా వెనుకబడి ఇళ్ల నిర్మాణాలను చేపట్టలేని వారికి ప్రభుత్వం అందించే రుణ సౌకర్యాలను వివరించి, రుణాలు పొంది నిర్మాణాలు పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే సచివాలయ, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు వివిధ దశలో ఉన్న వాటిని త్వరితగతిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పార్టీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకే ప్రత్యేక తరగతులు



మోడల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నగరి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్న దిశగా ప్రభుత్వ సూచనల మేరకు ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి, మెరుగైన విద్యాబోధన అందిస్తున్నారు. పబ్లిక్ పరీక్షలకు ముందుగా వారిలోని సామర్థ్యాలను పసిగట్టి విద్యార్థులు ఏ సబ్జెక్ట్‌లో వెనుకపడి ఉన్నారో గ్రహించి, వారిని మెరుగు పరచడానికి విజయస్ఫూర్తి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మండలంలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం విజయస్ఫూర్తి పరీక్షలు నిర్వహించారు.

ఉపాధికి రాజమార్గం

పారిశ్రామిక రంగంలో విస్తృత అవకాశాలు..శిక్షణతో వైవిధ్యత.. ఐటీఐ పూర్తి చేస్తే చాలు ఏదో ఒక పరిశ్రమలో ఉపాధి. తక్కువ సమయంలో ఉపాధికి రాజమార్గం ఏర్పడినట్టేనన్న భావనతో విద్యార్థులు వృత్తి విద్యాకోర్సులపై మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని వృత్తివిద్యా కళాశాలపై ప్రత్యేక కథనం.

- వృత్తి విద్యా కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ
- పలకరిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు
- అవకాశాలను అందిపుచ్చుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

కార్వేటినగరం: క్రమశిక్షణతో కూడిన వృత్తి విద్య, నైపుణ్యం గల కార్మికులను తయారు చేస్తూ ప్రభుత్వ ఐటీఐలు తమ ప్రత్యేక ముద్రవేస్తున్నాయి. తక్కువ సమయంలో జీవితంలో స్థిరపడడానికి అండగా నిలుస్తున్నాయి. ఐటీఐ చేసిన వారికి ప్రస్తుతం విస్తృత ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కార్వేటినగరం, వెదురుకుప్పం రెండు మండలాల్లో ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)కళాశాలల్లో 420 మంది విద్యార్థులు వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పొందుతున్నారు. అత్యధికంగా విద్యార్థులు ఎలక్ట్రీషన్ విభాగాన్ని ఎంచుకుంటున్నారు. ఆ తర్వాత కంప్యూటర్, పిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులను వారి ఆసక్తి మేరకు ఎంచుకుని శిక్షణ పొందుతున్నారు. అయితే రైల్వే, ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలనుకునే వారు మాత్రం పిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులపై మక్కువ చూపుతున్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సాంకేతిక శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, కళాశాల్లో కంప్యూటర్ శిక్షణకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఇప్పటికే కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులు డిఫెన్స్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే పిట్టర్, డీజిల్ మెకానిక్ చేసిన వారు సుమారు 60 శాతం నుంచి 70 శాతం వరకు రైల్వే, ఆర్టీసీ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ తమ జీవితాలలో వెలుగులు నింపుకుంటున్నారు.

మహిళలకు డ్రస్ మేకింగ్,

డ్రస్‌మేకింగ్‌పై విద్యార్థినులలు, మహిళలు ఎక్కువ ఆసక్తి చూపుతుంటారు. ఇంటివద్దనే ఉంటూ జీవనోపాధికి దోహదపడే డ్రస్ మేకింగ్‌లో శిక్షణ పొందిన వారు సుమారు 80 శాతం నుంచి 90 శాతం వరకు ఉపాధి పొందుతున్నారు.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు



ఐటీఐ శిక్షణ పూర్తి చేసేలోపు తమకు కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక అయ్యేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ కంప్యూటర్ శిక్షణతో భవిష్యత్‌లో మంచి ఉద్యోగం సాధించగలమన్న నమ్మకం నాకు దొరికింది. – ఎస్,కాంచన, విద్యార్థిని, ప్రభుత్వ ఐటీఐ, కార్వేటినగరం.

నైపుణ్యాభివృద్ధి



ఐటీఐ శిక్షణతోపాటు నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. నేను పొందుతున్న సాంకేతిక శిక్షణతో వృత్తి నైపుణ్యం పెరిగి ఉద్యోగం వస్తుందన్న నమ్మకం కుదిరింది. సాంకేతిక శిక్షణ ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగాలు సాధించేందుకు ఇదో మంచి అవకాశం. ఎస్.ఎల్ గణపతి, విద్యార్థి, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, కార్వేటినగరం.